

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 30-09-2025 సంపుటి: 07 సంచిక: 141 పేజీలు: 8 వెల: రూ 3-00





విజయవాడ, సెప్టెంబర్ 29: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దర్శనార్థం సాధారణ భక్తులకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. భక్తుల కోసం నిర్మిస్తున్న అన్న ప్రసాద భవనం మరో ఆరు నెలల్లో పూర్తవుతుందని చెప్పారు. సోమవారం ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో కొలువు తీరిన శ్రీదుర్గమ్మకి సీఎం చంద్రబాబు నాయుడు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం దేవాలయం బయట సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. రూ.25 కోట్లతో 1,500 మంది భక్తులు భోజనం చేసే విధంగా అన్న ప్రసాద భవనం నిర్మిస్తున్నామన్నారు. రూ. 27 కోట్లతో 3 నెలల్లో ప్రసాదం తయారీ కేంద్ర పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. అలాగే రూ.5.5 కోట్లతో ప్రధాన ఆలయం వద్ద పూజా మండపానికి సంబంధించిన నిర్మాణ పనులు చేపట్టామని సీఎం నారా చంద్రబాబు నాయుడు వివరించారు. ప్రభుత్వం తరపున దుర్గమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రజలకు సుఖ సంతోషాలు అందించాలని అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు. దుర్గమ్మ దయతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోందని.. దీంతో రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ జలకళతో ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలంతా ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని.. రాష్ట్ర సంపద పెరగాలని ఆయన ఆకాంక్షించారు. నవరాత్రుల సందర్భంగా ఇప్పటి వరకూ 8 లక్షల మంది భక్తులు.. దుర్గమ్మ వారిని దర్శించుకున్నారని వివరించారు. రోజు ఒక్క రోజే 1.20 లక్షల మంది భక్తులు.. దుర్మమ్మను దర్శించుకున్నారని పేర్కొన్నారు. అమ్మ వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. పవిత్రతను కాపాడుతూ.. అధిక మంది భక్తులకు దర్శన భాగ్యం కల్పించేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు

# అర్జీల పరిష్కారంలో నాణ్యతే ముఖ్యం: జిల్లా కలెక్టర్ జి రాజకుమారి గణియా



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 29-:?ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించే అర్జీల పరిష్కారంలో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి 263 దరఖాస్తులు స్వీకరించారు.?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీలను జాగ్రత్తగా పరిశీలించి, సరైన రీతిలో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. గత ఏడాది జూన్ 15 నుండి ఇప్పటి వరకు స్వీకరించిన మొత్తం 43,143 అర్జీలలో, నాణ్యమైన పరిష్కారం లేకపోవడం వల్ల 471 దరఖాస్తులు రీ-ఓపెన్ అయ్యాయని తెలిపారు. రీ-ఓపెన్ అయిన వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.?ప్రస్తుతం 1,926 దరఖాస్తులు నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాల్సి ఉందని, ఇందులో రెవెన్యూ, సర్వే, పోలీస్ శాఖల్లో ఎక్కువ పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. గడువు ముగిసే వరకు వేచి చూడకుండా వెంటనే పరిష్కరించాలని ఆమె సూచించారు.?15 మండలాల్లో ఫీడ్‌బ్యాక్ సేకరణలో జాప్యంపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేస్తూ, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత తహసీల్దారులను ఆదేశించారు. భూ సమస్యలు, డ్రైనేజీ సమస్యలు, ఇంటి స్థలం కేటాయింపు వంటి అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. అన్ని అర్జీలను గడువులోగా పరిష్కరించేందుకు అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# అర్జీలను గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలి :జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



కర్నూలు, సెప్టెంబర్ 29 ( విభారె) అర్జీదారుల నుండి వచ్చిన అర్జీలను గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్ లాగిన్ లో పరిష్కారం చేసిన అర్జీలను ఆడిట్ చేయాల్సి ఉందన్నారు. అర్జీల ఆడిట్ పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. పిజిఆర్ఎస్ లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికపుడు చూడాలని కలెక్టర్ ఆదేశించారు. సిఎంఓ గ్రీవెన్స్ కు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 9, కర్నూలు ఆర్డీఓ వద్ద 8, పత్తికొండ ఆర్డీఓ వద్ద 2, కలెక్టరేట్ ఏవో వద్ద 3, జిల్లా రిజిస్ట్రార్, డిఎంహెచ్ఓ, డిఆర్డిఏ పిడి, పంచాయతీ రాజ్, ఏపిఐఐసి జెడ్ఎం ల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్ లో ఉన్న వాటిని గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని, ఎక్కడైనా ఐవీఆర్ఎస్ ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించలేదని ఫిర్యాదులు వస్తే సంబంధిత సచివాలయ సిబ్బంది పై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.. జడ్పీ సీఈవో, మున్సిపల్ కమిషనర్ లు ఈ అంశంపై పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతే వారి రక్షణ--:పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి: మంత్రి ఫరూక్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 29-:?గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పరిశుభ్రత విషయంలో పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ అన్నారు. సోమవారం నంద్యాల పురపాలక సంఘం పరిధిలోని కార్మికుల కోసం 'సఫాం ఇ మిత్ర సురక్ష శివిర్'లో భాగంగా శాంతిరాం జనరల్ ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారితో కలిసి ప్రారంభించారు.?కార్మికులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పనుల సమయంలో రక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని మంత్రి సూచించారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని జిల్లా ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.?జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని అన్నారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్మికులు తప్పనిసరిగా గ్లౌజులు, మాస్కులు వంటి రక్షణ పరికరాలను వినియోగించాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ వంటి వాటితో పాటు బీపీ, షుగర్ వంటి వ్యాధులు రాకుండా నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు.?ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్. ఇతర అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ వద్దు బ్రో': నంద్యాల జిల్లా డ్రగ్స్ లేని ప్రాంతంగా తీర్చిదిద్దాలి:కలెక్టర్ జి. రాజకుమారి గణియా




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 29-:?మత్తు పదార్థాల నియంత్రణపై గట్టి నిఘా ఉంచి, జిల్లాను డ్రగ్స్ లేని ప్రాంతంగా మార్చడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన "డ్రగ్స్ వద్దు బ్రో" కార్యక్రమ సమీక్షలో ఆమె మాట్లాడారు.?మహిళా రక్షణ, నిఘా కీలకం:?మత్తు పదార్థాల నియంత్రణతో పాటు మహిళా రక్షణకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈగల్ టీమ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజల అభిప్రాయాలను (పబ్లిక్ పర్సెప్షన్) ఐవీఆర్ఎస్, క్యూఆర్ కోడ్ ద్వారా సేకరించి, ఆ మేరకు జిల్లాకు ర్యాంకింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాను ఇప్పటికే ఐడి (ఎఅ) లిక్కర్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దడం జరిగిందని తెలిపారు.?డి-అడిక్షన్ సెంటర్, టోల్ ఫ్రీ నంబర్:?ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డి-అడిక్షన్ సెంటర్‌ను వినియోగించుకోవాలని కోరారు. ఎస్పీ మంద జవాలి అల్ఫోన్స్ మాట్లాడుతూ... ఈ సంవత్సరం 11 కేసులు నమోదు చేసి 17 కిలోల డ్రగ్స్ సీజ్ చేశామన్నారు. డ్రగ్స్ నివారణ కోసం 1972 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉందని తెలిపారు. అనంతరం కలెక్టర్ ఈగల్ టీమ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.




# సంపాదకీయం

మంగళవారం 30-09-2025

## తొక్కిసలాటలు ఎందుకు జరుగుతున్నాయి..

తమిళనాడులోని కరూర్‌లో నటుడు, టీవీకే అధినేత విజయ్ ప్రచార సభలో జరిగిన తొక్కిసలాటలో 38 మంది ప్రాణాలు కోల్పోవడం.. దేశవ్యా?ప్తంగా సంచలనం సృష్టించింది. ఇదొక్కటే కాదు దేశవ్యాప్తంగా తరచుగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో కుంభమేళా మొదలు ఢిల్లీ రైల్వేస్టేషన్, గోవా, ఆర్సీబీ విజయోత్సవ వేడుకల్లో తొక్కిసలాట జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. సముద్రం ఉప్పొంగలేదు, అగ్ని కీలలు ఎగసి పడలేదు, గాలివాన బీభత్సం సృష్టించలేదు, ఏ వాహనానికి ప్రమాదం జరగనూ లేదు. కానీ ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే 38 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. తమిళనాడులోని కరూర్‌లో నటుడు, టీవికే పార్టీ అధినేత విజయ్ ప్రచార సభలో జరిగిన తొక్కిసలాట అంతులేని విషాదం మిగిల్చింది. ఈ ఘటనలో మరో 50 మందికి పైగా గాయాలపాలయ్యారు. మృతుల్లో పిల్లలు కూడా ఉండటం గుండెలను పిండేస్తోంది. అయితే ఇది ఎక్కడో ఒక చోట, ఎప్పుడో ఒకసారి జరిగిన ఘటన కాదు. ఈ ఏడాది జనవరి మొదలు ఇప్పటి దాకా.. దేశవ్యాప్తంగా జరిగిన తొక్కిసలాటల్లో అనేక మంది మృత్యువాతపడ్డారు. వేడుకగా నిర్వహించే కార్యక్రమాలే.. మృత్యుకూపాలుగా మారుతుండటంపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 2025 జనవరిలో మహాకుంభ మేళాలో తొక్కిసలాట జరిగింది. జనవరి 29న మౌని అమావాస్య సందర్భంగా పవిత్ర స్నానాలు ఆచరించడానికి భక్తులు వచ్చిన క్రమంలో తొక్కిసలాట జరిగి 30 మంది మృతిచెందారు. 60 మందికిపైగా క్షతగాత్రులయ్యారు. ఆ తర్వాత ఫిబ్రవరిలో ఢిల్లీలోని రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో మహిళలు, పిల్లలు సహా 18 మంది చనిపోగా మరో 20 మందికిపైగా గాయపడ్డారు. మేలో గోవాలోని శ్రీ లైరై దేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు, జూన్‌లో ఆర్సీబీ ఐపీఎల్ టైటిల్ గెలిచిన సందర్భంగా బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద చేపట్టిన విజయోత్సవ ర్యాలీలో తొక్కిసలాట జరిగి 11 మంది ప్రాణాలు కోల్పోయారు. 33 మంది గాయపడ్డారు. ఇదే నెల.. పూరి రథయాత్రలో ముగ్గురు చనిపోయారు. సెప్టెంబర్ 27న కరూర్‌లో 8 మంది పిల్లలతో సహా 38 మంది తొక్కిసలాటకు బలయ్యారు. అప్పటివరకు ఆహ్లాదంగా ఉన్న ప్రదేశాలు.. తొక్కిసలాటతో మృత్యుకూపాలుగా మారుతున్నాయి. దీనికి సాధారణంగా.. క్రౌడ్‌లో ఉండే ప్యానిక్ కారణం అని నిపుణులు చెబుతున్నారు. అయితే ఫోరెన్సిక్ సమీక్షలు, పరిశోధనల వివరాల ప్రకారం తొక్కిసలాటలకు ముఖ్య కారణం.. ప్రమాదకర రీతిలో జన సాంద్రత ఉండటమే అని తెలుస్తోంది. ఒక చదరపు మీటర్ ప్రదేశంలో సాధారణంగా 5-7 మంది ఉండాల్సింది.. అంతకంటే ఎక్కువగా కుక్కినట్లుగా ఉండటం, కాలు కదిపే అవకాశం కూడా లేకపోవడం వల్ల.. తో పరిస్థితి దగజారుతోంది. మనం నీళ్లను చిన్నగా తాకితే ఎలా అలలు ఏర్పడతాయో.. మొత్తం ప్యాక్డ్‌గా ఉన్న జనాన్ని ఎవరైనా చిన్నగా తోసినా.. అది పలు రెట్లు పెరిగి కిందపడిపోతారు. అనంతరం ఇతరులు ప్యానిక్ అవుతూ.. అటు ఇటు పరుగెడుతూ తప్పించుకోవడానికి ప్రయత్నిస్తారు. ఈ క్రమంలో కింద పడిపోయిన వారు.. మిగతా వాళ్ల కాళ్ల కింద చిక్కుకుపోయి, ఊపిరాడక ప్రాణాలు కోల్పోతారు. రాజకీయ పార్టీల సభలు, సినిమా వేడుకలు, రవాణా ప్రాంతాల్లో ఇలాంటి తొక్కిసలాటలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటి కార్యక్రమాల్లో కొన్ని సందర్భాల్లో పుకార్లు ప్యానిక్‌ను సృష్టిస్తున్నాయి. అది తొక్కిసలాటలకు దారి తీస్తోంది. క్రౌడ్ కంట్రోల్ విషయంలో నిర్వహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సరైన ఎంట్రీ, ఎగ్జిట్ ప్లానింగ్.. కార్యక్రమం జరిగే ప్రదేశంలో లైనింగ్స్, బ్యారికేడ్లు లేకపోవడం తొక్కిసలాటలకు దారితీస్తోంది. ఇక జనం ఎక్కువగా వచ్చే ఈవెంట్లలో క్రౌడ్ మేనేజర్లను మోహరించడం లేదు. కొన్ని సందర్భాల్లో పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకునేందుకు వారికి ట్రైనింగ్, అనుమతి ఇవ్వడం లేదు. ఒకవేళ వలంటీర్లను నియమించినా.. వారికి ప్రమాదకర జనసాంద్రత గురించి అవగాహన లేక క్రౌడ్‌ను కంట్రోల్ చేయలేకపోతున్నారు. ఫలితంగా తొక్కిసలాటలకు దారితీస్తోంది. వివిధ కార్యక్రమాల్లో లీడర్లు, పూజలు, దర్శనం అంటూ.. జనాలను ఎక్కువ సమయం వెయిట్ చేయిస్తున్నారు. తాజాగా కరూర్‌లో విజయ్ కోసం కూడా అభిమానులు దాదాపు 6 గంటలు ఎదురుచూడాల్సి వచ్చింది. ఇలా జరిగినప్పుడు ప్రజల్లో అసహనం పెరుగుతుంది. కుంభమేళా లాంటి ప్రదేశాల్లో సీసీటీవీలు, క్రౌడ్‌ను సూచించే సెన్సార్లు ఏర్పాటు చేసినా.. అవి ఇచ్చిన డేటా ఆధారంగా నిర్ణయం తీసుకోవడంలో నిర్వాహకులు విఫలం అయ్యారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే.. అంబులెన్స్‌లు రావడానికి, జనాలు పారిపోవడానికి సరైన మార్గాలు ఉండటం లేదు. ఇంత మంది ప్రాణాలు తీస్తున్న ఇలాంటి తొక్కిసలాటలను సీరియస్‌గా పరిగణించాలి. అవసరమైతే నిర్వాహకులు పటిష్ట భద్రత చర్యలు తీసుకునేలా చట్టాలు రూపొందించాలి. ఆర్సీబీ ఘటన తర్వాత కర్ణాటక ప్రభుత్వం క్రౌడ్ కంట్రోల్ బిల్ 2025 తీసుకొచ్చింది. రాజకీయ, సినిమా, మతపరమైన కార్యక్రమాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు.. నిర్వాహకులకు.. వారు తీసుకోవాల్సిన భద్రత చర్యల గురించి వివరించాలి. అంతర్జాతీయంగా అమలులో ఉన్న భద్రత ప్రమాణాలు పాటించేలా చేయాలి. లేదంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించాలి. కార్యక్రమం ఏర్పాటు చేసే ప్రదేశానికి అనుగుణంగా జన సమూహానికి (అంచనాలు కాదు, శాస్త్రీయంగా లెక్కించాలి) అనుమతించాలి. అలాగే ఇండిపెండెంట్ నిపుణులు ధ్రువీకరించిన క్రౌడ్ మేనేజ్‌మెంట్ ప్లాన్లను నిర్వాహకులు అధికారులకు ముందే సమర్పించేలా చర్యలు చేపట్టాలి. ఇలాంటి కార్యక్రమాల్లో మన భద్రత కేవలం నిర్వాహకులపై మాత్రమే లేదు.

# సుప్రీంకోర్టును ఆశ్రయించిన సహారా గ్రూప్..

## ఆస్తులను అమ్మేందుకు అనుమతి ఇవ్వాలని పిటిషన్..!



న్యూఢిల్లీ: సహారా గ్రూప్ కంపెనీల భవిష్యత్తుకు సంబంధించి ఓ కీలక పరిణామం చోటు చేసుకున్నది. కంపెనీ పాలసీ మేకర్స్ ఈ గ్రూప్ ఆస్తులను అదానీ ప్రాపర్టీస్ లిమిటెడ్‌కు విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు అనుమతి కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మహారాష్ట్రలోని అంబీ వ్యాలీ, లక్నోలోని షహరా సిటీతో సహా వివిధ ఆస్తులను అదానీ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విక్రయించడానికి అనుమతి కోరుతూ సహారా ఇండియా కమర్షియల్ కార్పొరేషన్ లిమిటెడ్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై అక్టోబర్ 14న విచారణ జరిగే అవకాశం ఉన్నది. న్యాయవాది గౌతమ్ అవస్థి దాఖలు ఈ పిటిషన్ దాఖలు చేశారు. సెప్టెంబర్ 6 నాటి టర్మ్ షీట్‌లో పేర్కొన్న నిబంధనలు, షరతులపై గ్రూప్ ఆస్తులను అదానీ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు విక్రయించేందుకు అత్యున్నత న్యాయస్థానం అనుమతి కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది సహారా గ్రూప్. పెండింగ్‌లో ఉన్న సహారా గ్రూప్ కేసుల్లో దాఖలు చేసిన మధ్యంతర దరఖాస్తులో కోర్టు ఎప్పటికప్పుడు జారీ చేసిన వివిధ ఆదేశాలకు అనుగుణంగా.. అనుమతి పొందిన తర్వాత ఎస్ఐసీసీఎల్, సహారా గ్రూప్ కొన్ని చరాస్తులు, స్థిరాస్తుల అమ్మకాలను చాలా కష్టంతో చేయగలిగాయని తెలిపింది. ఈ నిధులను సెబీ-సహారా రీఫండ్ ఖాతాలో జమ చేశారు. మొత్తం రూ.24,030 కోట్ల ప్రిన్సిపల్ మొత్తంలో సహారా గ్రూప్ తన చరాస్తులు, స్థిర ఆస్తుల అమ్మకం, లిక్విడేషన్ ద్వారా సుమారు రూ.16వేల కోట్లు సేకరించి, సెబీ-సహారా రీఫండ్ ఖాతాలో జమ చేసింది అని తెలిపింది. ఎస్టేట్ బ్రోకరేజ్ కంపెనీల సేవలను ఉపయోగించినప్పటికీ సహారా గ్రూప్ ఆస్తులను లిక్విడేట్ చేయడం, విక్రయించడంలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) అసమర్థతను ఎత్తి చూపుతూ.. సెబీ-సహారా రీఫండ్ ఖాతాలో జమ చేసిన మొత్తాన్ని చాలా˘ష్టంతో, దరఖాస్తుదారు, సహారా గ్రూప్ ప్రయత్నాల ద్వారా జమ చేశామని ఎస్ఐసీసీఎల్ తెలిపింది. నవంబర్ 2023లో సహారా గ్రూప్ చీఫ్ సుబ్రతా రాయ్ మరణం తర్వాత.. గ్రూప్ తన ఏకైక నిర్ణయాధికారిని కోల్పోయిందని ఎస్ఐసీసీఎల్ పేర్కొంది. ఆయన తన జీవితకాలంలో గ్రూప్ తరఫున అన్ని నిర్ణయాలు తీసుకున్నారని.. దివంగత సుబ్రతా రాయ్ కుటుంబ సభ్యులు సహారా గ్రూప్ రోజువారీ వ్యాపార కార్యకలాపాలు, నిర్వహణలో పాల్గొనలేదని.. అయితే పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడాలనే కుటుంబ సభ్యుల కోరికను దృష్టిలో ఉంచుకుని సహారా గ్రూప్ ఆస్తులను సాధ్యమైనంత ఎక్కువ ధరకు విక్రయించాలని.. ఈ కోర్టు జారీ చేసిన ఆదేశాలను పాటించాలని, సహారా గ్రూప్ బాధ్యతలను తీర్చాలని, ప్రస్తుత ధిక్కార చర్యలను ముగించాలని నిర్ణయించినట్లుగా పిటిషన్‌లో పేర్కొంది. వాటాదారుల ప్రయోజనాల కోసం, ముఖ్యంగా సహారా గ్రూప్ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్ఐసీసీఎల్ తెలిపింది. ఎస్ఐసీసీఎల్ ప్రకారం.. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, ఆచరణీయమైన ఆఫర్లు లేకపోవడం, అనేక పెండింగ్ వ్యాజ్యాల కారణంగా ఈ ప్రయత్నాలు ఎలాంటి సానుకూల ఫలితాలను ఇవ్వలేదని.. ఇది సమష్టిగా కొనుగోలుదారుల విశ్వాసాన్ని దెబ్బతీసిందని, ఆస్తుల మార్కెట్ సామర్థ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేసిందని తెలిపింది. దివంగత సుబ్రతా రాయ్ కుటుంబ సభ్యులు, సహారా గ్రూప్, ఇతర సీనియర్ అధికారులపై బహుళ దర్యాప్తు సంస్థలు విచారణలు ప్రారంభించడం ద్వారా ప్రయత్నాలు మరింత క్లిష్టంగా మారాయని ఎస్ఐసీసీఎల్ పేర్కొంది. తాము పేర్కొన్నవన్నీ సమాంతర, సమన్వయం లేని చర్యలు పెట్టుబడిదారులు, డిపాజిటర్ల మనసులో గందరగోళం, విరుద్ధమైన కథనాలు, అవసరమైన అనుమానాలను సృష్టించడమే కాకుండా సహారా గ్రూప్ తన ఆస్తులను డబ్బు ఆర్జించడానికి, కోర్టు ఆదేశాలను పాటించడానికి చేస్తున్న ప్రయత్నాలను సమర్థవంతంగా అడ్డుకుంటున్నాయని పిటిషన్‌లో పేర్కొంది.

# హత్య కేసులో నిందితుల అరెస్టు

**రక్తం మర్కులు గల కర్రలు, దుస్తులు, 01 వివో ఫోన్ స్వాధీనం**

**నిందితులు రిమాండ్ కు తరలింపు..**

**డీఎస్పీ రఘు చందర్ వెల్లడి**

జగిత్యాల సెప్టెంబర్ 29, (న్యూస్ పల్స్)జిల్లాలోని సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో ఈ నెల 27న జరిగిన హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు జగిత్యాల డిఎస్పీ రఘు చందర్ వెల్లడించారు. సోమవారం జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ లో జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై గీత లతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రఘు చందర్ మాట్లాడుతూ సారంగాపూర్ మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన ఎదురుగట్ల సతీష్ (30) తన ఇంస్టాగ్రామ్ లో ఓ అమ్మాయితో ఉన్న ఫోటోను సోషల్ మీడియా లో షేర్ చేశాడని, సదరు అమ్మాయి తన ప్రియురాలు అని పెట్టారని, వేరే ఎవ్వరూ ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోవద్దని అంటూ కామెంట్ వ్రాసి పోస్ట్ చేశాడని,ఆ అమ్మాయి కుటుంబ సభ్యులు నాథిరి .వినంజీ(22), నాథిరి శాంత(50), నాథిరి. జల(30), ఆగ్రహానికి గురై ఈ నెల 27న ఎదురుగట్ల సతీష్ పై కర్రలతో దాడి చేశారని, ఈ దాడిలో ఎదురుగట్ల సతీష్ అక్కడికక్కడే మృతి చెందగా, నిందితులు అక్కడి నుండి పారిపోయారని తెలిపారు. మృతుని తండ్రి ఎదురుగట్ల రాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సోమవారం లేచి పల్లి గ్రామ టి-జంక్షన్ వద్ద వెహికల్ చెకింగ్ చేస్తున్న క్రమంలో నిందితులను పట్టుకున్నామని డీఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద నుండి హత్యకు ఉపయోగించిన రక్తం మర్కులు గల కర్రలు, దుస్తులు, 01 వివో ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.హత్య కేసును త్వరగా చేధించి నిందితులను పట్టుకున్న జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, సారంగాపూర్ ఎస్సై గీత, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

# కదం తొక్కిన ఆదివాసులు

భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 29, ( భద్రాచలంలో ఆదివాసీలు కదం తొక్కారు..లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని చలో భద్రాచలం పేరిట పిలుపునిచ్చిన ఆదివాసి జేఏసీ సంఘాలు ఆ మేరకు ఈరోజు ధర్మం యుద్ధం పేరిట భద్రాచలం పట్టణం లోని జూనియర్ కళాశాల గ్రౌండ్ లో భారీ బహిరంగ సభ నిర్వహించారు..ఐతే ఈ సభకు అంచనాలకు మించి ఆదివాసీలు హాజరవడంతో సభా ప్రా?ంగణం కిక్కిరిసిపోయింది..సుమారు 50 వేలకు పైచిలుకు ఆదివాసికి చెంధిన 9 తెగల ప్రజలు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చారు.భద్రాచలం చెరుకున్న ఆదివాసీలు ముందుగా గిరిజన సాంప్రధాయ నృత్యాలతో బ్రిడ్జి సెంటర్ నుంచి జూనియర్ కాలేజ్ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి సభను ప్రారంభించారు..పెద్దయెత్తున ఆదివాసీలు పోలోగొన్న ఈ కార్యక్రమంలోఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగానే వందల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు భద్రాద్రి పోలీసులు..ధర్మ యుద్ధం నిర్వహించిన సభకు హాజరైన ఆదివాసీ సంఘాల నాయకులు మరియు అధివాసి మాజీ ఎమ్మెల్యేలు పోల్గొని వారు మాట్లాడుతు......ప్రస్థుతం ఎస్ టి రిజర్వేషన్లు పొందుతున్న బంజారా, లంబాడా, సుగాలీ వర్గాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని...వీరు గిరిజనులు కాదని, 1976 వరకు ఉమ్మడి ఏపీలోని తెలంగాణ జిల్లాల్లో వారిని ఎస్టీలుగా పరిగణించలేదని, ఇతర రాష్ట్రాల నుంచి వారు తెలంగాణకు వలస వచ్చి ఇక్కడి అసలైన గిరిజనుల హక్కులను కొల్లగొట్టారని ఆరోపిం చారు. అంతకు ముందు వారు బీసీ జాబితాలో ఉన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్ లో విలీనమైన సందర్భంలో ఆంధ్రా ప్రాంతం మద్రాసు రాష్ట్రంలో ఉందని, ఆ సమయంలో లంబాడా, సుగాలీలను ఏపీ ప్రాంతం లో ఎస్టీలుగా గుర్తించారని తెలిపారు. కానీ హైదరాబాద్ స్టేట్లో కాదని స్పష్టం చేశారు. తర్వాతి కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఆ మూడు వర్గాలను ఎస్టీ జాబితాలో చేర్చిందని వివరించారు. ఇప్పుడు మళ్లీ తెలంగాణ, ఏపీలు రెండు రాష్ట్రాలుగా విడిపోయినందున తెలంగాణలోని బంజారా, లంబాడా, సుగాలీలను తిరిగి బీసీ జాబితాలో చేర్చేలా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.. లంబాడా, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబి తాలో చేర్చడంజాబితాలోని ఇతర వర్గాలకంటే అభివృద్ధి చెందాయని,. దీని వల్ల నిజమైన ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని అన్నారు. చట్టబద్ధత లేకుండా తమకి రావాల్సిన హక్కులను పొందుతున్న లంబాడి సోదరులు మాపై ఆదిపత్యానికి తెరలేపారని..ఇప్పటికైనా బుద్ధి మార్చుకోకపోతే తమ ఉద్యమం వువ్వేత్తునా కోనసాగుతోంధని,మీకు అంటగాకే కొంతమంది రాజకీయ నాయకులు కుట్రలకి పాల్పడితే భవిష్యత్ లో మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు..

# పేదల సొంతింటి కల నెరవేరుస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.

**.---అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం..**

**---దగ్గరుండి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేయిస్తా-**

**--వచ్చే దసరా లోపు గృహప్రవేశాలు జరిగేలా చూస్తా..**

**--- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**

కరీంనగర్ సెప్టెంబర్ 29, (న్యూస్ పల్స్)ఎన్నో ఏండ్ల పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాకారం చేస్తున్నారనీ, కరీంనగర్ నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. కరీంనగర్ నియోజకవర్గ ప్రజలకు ఈ బతుకమ్మ దసరా పండుగకు ఒక ప్రత్యేకత ఉందనీ, ఇందిరమ్మ ఇండ్లను ముఖ్యమంత్రి దసరా కానుకగా అందిస్తున్నారని తెలిపారు. సోమవారం కరీంనగర్ రూరల్ మండలం చెర్లబుత్కూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన 194 లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను వెలిచాల రాజేందర్ రావు చేతుల మీదుగా అందజేశారు. అంతకుముందు చర్లబుత్కూరు గ్రామంలో రాజేందర్రావుకు గ్రామ ప్రజలు, మహిళలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో చర్లబుత్కూరు గ్రామ కాంగ్రెస్ నాయకులు, మహిళలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బదిలీపై వెళుతున్న పి.ఓ జే.కే ఓ.సి. కృష్ణ మోహన్ రావు కు సన్మానం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 29, (న్యూస్ పల్స్) ఇల్లందు ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో జే.కే 5 ఓ.సి లో ఏజెంట్ గా పనిచేసి కొత్తగూడెం ఏరియా లోని కార్పొరేట్ కు బదిలీపై వెళుతున్న కృష్ణ మోహన్ రావు ని జనరల్ మేనేజర్ వి.కృష్ణయ్య మరియు ఇతర అధికారులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వి. కృష్ణయ్య మాట్లాడుతూ కృష్ణ మోహన్ రావు సింగరేణి సంస్థ లో వివిధ హోదాలలో పనిచేశారని, వారు జే.కే ఓపెన్ కాస్ట్ లో చేసిన సేవలు మరువలేనివని, అంకితభావంతో పని చేసి అందరిమన్నలను పొందారని కొనియాడారు. ఇల్లందు ఏరియాలో పని చేసి తనదైన ముద్ర వేశారని కొనియాడారు. కార్పొరేట్ ఏరియాలో పి.సి.ఓ లో కూడా మంచి పేరు తెచ్చుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం రామస్వామి, , కే.ఓసి. పి. ఓ గోవింద రావు, ఏ. జి యం. ఇ డి గిరిదర్ రావు ఏరియా ఇంజనీర్ నరసింహారాజు, ఏ. యస్. ఓ. జాకీర్ హుస్సేన్ డిజియం పర్సనల్ అజ్మీర తుకారం, డిజియం సివిల్ రవికుమార్, డీజీఎం మధుబాబు జెకె మేనేజర్ పులి పూర్ణచంద్రరావు దిలీప్ కుమార్, నాగేశ్వరరావు రాందాసు, రామ్మూర్తి, సతీష్ కుమార్, చిన్నయ్య మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే గండ్ర

జయశంకర్ భూపాలపల్లి. సెప్టెంబర్ 29, (న్యూస్ పల్స్) జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజలకు మరియు రాష్ట్ర ప్రజలందరికీ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు భూపాలపల్లి మంజూరునగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి మీడియాకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. గ్రామాలల్లో నిండిన చెరువులు, పచ్చని పంట పొలాల పక్కన ప్రకృతితో మమేకమై, తొమ్మిది రోజుల పాటు సాగిన ఆడబిడ్డల ఆటాపాటలతో పల్లెలు, పట్టణాలు ప్రత్యేక సాంస్కృతిక వాతావరణాన్ని సంతరించుకున్నాయన్నారు. ఈ సందర్భంగా విజయాలను అందించే విజయదశమిని స్వాగతిస్తూ, తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేపట్టిన పనులు పూర్తయ్యాయని ఎమ్మెల్యే ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లేలా, ప్రజలంతా సుఖశాంతులతో జీవించి, దినదినాభివృద్ధి పొందేలా దీవించాలని అమ్మవారిని ఎమ్మెల్యే ప్రార్థించారు.

## అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి..

# బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపిన హరీశ్‌రావు

హైదరాబాద్, ప్రపంచంలో పువ్వులను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణలోనే ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తెలిపారు. ఈ బతుకమ్మ పండుగ ప్రపంచంలోనే తెలంగాణకు ప్రత్యేక స్థానాన్ని తెచ్చిన పండుగ అని కొనియాడారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడ్గ గ్రామంలో వెలిసిన శ్రీవిజయదుర్గా సమేత శ్రీ సంతాన మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని హరీశ్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రజలందరికీ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ ఉద్యమ ప్రస్థానంతో, తెలంగాణ రాష్ట్ర సాధనతో తెలంగాణ పండుగలు విశ్వవిఖ్యాతమయ్యాయని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ ఆడబిడ్డలు అందరూ ఈ పండుగని చాలా గొప్పగా జరుపుకుంటున్నారని అన్నారు. తెలంగాణ వాళ్లు ఏ దేశంలో ఉన్నా, ఎక్కడున్నా చాలా గొప్పగా జరుపుకుంటున్నారని అన్నారు. బతుకమ్మ పండుగ ప్రకృతిని పూజించే పండుగ. మన అక్క చెల్లెల్లు ఆటపాటలతో పూలను పూజించి చెరువులో కలుపుతారని పేర్కొన్నారు.నీటిలో కీటకాలు ఉంటాయని అన్నారు. మనం తంగేడు పువ్వు, గునుగు పువ్వులను నీటిలో వేయడం వల్ల నీళ్లు పరిశుభ్రమవుతాయని వివరించారు. పూర్వం మన పెద్దలు ఎంత గొప్పగా ఆలోచించారో ఈ పండుగ చూస్తే అర్థమవుతుందని చెప్పారు.బతుకమ్మ అప్పుడు ఆడపడుచులు తల్లిగారి ఇంటికి రావడం, అక్కడ పాటలు పాడడం లాంటి గొప్ప అనుభూతి ఉంటుందని హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమం ఎప్పుడు ప్రారంభమైందో అప్పుడు ఈ బతుకమ్మకు చాలా గొప్ప గుర్తింపు వచ్చిందని తెలిపారు. కేసీఆర్ బతుకమ్మని రాష్ట్ర పండుగగా జరిపారని గుర్తుచేశారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలని ప్రార్థించారు. ఈ పండుగ అందరి జీవితాల్లో వెలుగును ప్రసాదించాలని, అందరికి సుఖసంతోషాలు ఆయురారోగ్యాలు కలిగించాలని భగవంతుడిని కోరారు.

# బాలకృష్ణ తో డ్యామేజ్..

హైదరాబాద్, సెప్టెంబర్ 29, ఇటీవల ఏపీలో జరిగిన రాజకీయ పరిణామాలతో పరిస్థితి మారింది. ముఖ్యంగా శాసనసభలో నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలతో కలకలం రేగింది. ఈ ఎపిసోడ్ మొత్తాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తనకు అనుకూలంగా మార్చుకుంటుంది. ఎప్పటి వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై సినీ పరిశ్రమకు ఉన్న అభిప్రాయాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోంది. మరోవైపు కుల రాజకీయాన్ని తెరపైకి తెస్తోంది. ఈ క్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు రంగంలోకి దిగారు. ఇప్పటికే ఈ ఘటనపై అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈ వివాదానికి కారణమైన వ్యాఖ్యలు చేసిన బిజెపి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్పందించారు. తన వ్యాఖ్యలతోనే అపార్థాలు చోటుచేసుకున్నాయని.. వాటిని రికార్డుల నుంచి తొలగించాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును కోరారు. మరోవైపు చిరంజీవితో మాట్లాడేందుకు కొందరు ప్రముఖులు సైతం రంగంలోకి దిగినట్లు ప్రచారం జరిగింది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ఏపీ సీఎం చంద్రబాబు మెగాస్టార్ చిరంజీవితో సమావేశం అవుతారని తెలుస్తోంది.సాధారణంగా నందమూరి బాలకృష్ణ అసెంబ్లీకి హాజరు కారు. చాలా అరుదుగా వస్తారు. అటువంటిది వచ్చి రాగానే ఈ అంశం పై మాట్లాడుతూ రచ్చ చేశారు. అయితే వాస్తవానికి నందమూరి బాలకృష్ణ స్పందనలో తప్పులేదు. కానీ చిరంజీవి ప్రస్తావన తీసుకొచ్చి.. అప్పట్లో ఎవరూ గట్టిగా అడగలేదని అనేసరికి చిరంజీవి స్పందించాల్సి వచ్చింది. తన కోరిక మేరకు మాత్రమే అప్పట్లో టిక్కెట్ ధరల పెంపునకు వైసీపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని మాత్రమే చెప్పారు. అయితే అది మొదలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.. అప్పట్లో చిరంజీవి విషయంలో జగన్మోహన్ రెడ్డి సోదర భావంతో మెలిగేవారని.. సినీ పరిశ్రమకు చాలా రకాల సహాయం చేశారని ప్రచారం చేయడం ప్రారంభించింది. అదే సమయంలో కూటమి పార్టీలో కీలక భాగస్వామిగా ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పూర్తి ఇరకాటంలో పడ్డారు. ఇటువంటి విషయాల్లో దూకుడుగా స్పందించే ఎమ్మెల్సీ నాగబాబు సైతం సైలెంట్ అయ్యారు. అయితే ఈ మొత్తం పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అందుకే చంద్రబాబు రంగంలోకి దిగనున్నారు. నేరుగా మెగాస్టార్ చిరంజీవితో సమావేశం అయి ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టనున్నారు.కూటమి అధికారంలోకి వచ్చిన

## చిరంజీవితో చంద్రబాబు భేటీ!

తర్వాత చాలా సార్లు చంద్రబాబును కలిశారు చిరంజీవి. వివిధ వేదికల వద్ద కలిసినప్పుడు ఈ ఇద్దరూ పరస్పరం గౌరవించుకున్నారు. చిరంజీవిని చంద్రబాబు ఎక్కువగా అభిమానించారు. అదే సమయంలో చిరంజీవి సైతం చంద్రబాబును చాలా గౌరవభావంతో చూసేవారు. మరోవైపు తన సోదరుడు పవన్ కళ్యాణ్ కూటమిలో కీలక భాగస్వామి కావడంతో చిరంజీవి సైతం చాలా బాధ్యతగా మెలిగేవారు. అందుకే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. అయితే ప్రస్తుతం ఇండస్ట్రీకి పెద్దదిక్కుగా ఉన్నారు చిరంజీవి. ఈ క్రమంలో రెండు రాష్ట్రాల ప్రభుత్వాలతో నిత్యం మాట్లాడుతూ ఉండేవారు. పరిశ్రమలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా నడుచుకునేవారు. ఈ క్రమంలోనే చిన్న చిన్న తప్పిదాలు జరిగాయి. అయితే పరిశ్రమ కోణంలో నందమూరి బాలకృష్ణ మాట్లాడారు. కానీ ఆయన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయంగా కూటమికి డ్యామేజ్ చేస్తున్నాయి. అందుకే దిద్దుబాటు చర్యల్లో భాగంగా చంద్రబాబు నేరుగా రంగంలోకి దిగుతారని తెలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవితో సమావేశంతో ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సినీ పరిశ్రమను సైతం ఇబ్బంది పెట్టిందని సభలో వ్యాఖ్యానించారు కామినేని శ్రీనివాస్. అప్పట్లో టిక్కెట్ ధర పెంపు అనేది మెగాస్టార్ చిరంజీవి గట్టిగానే అడిగితేనే జగన్ ఒప్పుకున్నట్లు కామినేని ప్రకటించారు. దానికి కౌంటర్ ఇచ్చారు నందమూరి బాలకృష్ణ. అప్పట్లో జరిగింది ఇది అంటూ చెప్పే క్రమంలో.. చిరంజీవి గట్టిగా అడిగితే జగన్ స్పందించారనేది తప్పు అని.. అప్పట్లో ఎవరు గట్టిగా అడగలేదని.. పైగా చిరంజీవికి అవమానం జరిగిందని చెప్పుకొచ్చారు బాలకృష్ణ. అయితే తన పేరు ప్రస్తావనకు తీసుకురావడంతో చిరంజీవి విదేశాల నుంచి స్పందించారు. నాడు ఏం జరిగింది అనే దానిపై ప్రకటనలో పేర్కొన్నారు. అప్పట్లో సినీ ప్రముఖుల విన్నపం మేరకు మాత్రమే తాను జగన్మోహన్ రెడ్డిని అందరినీ తీసుకెళ్లి కలిశానని.. దాని ఫలితమే వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి లాంటి సినిమాలకు టిక్కెట్ల ధర పెంపు అనుమతి అంటూ చెబుతూ ముగించారు.అప్పటినుంచి వివాదం చినికి చినికి గాలి వానలా మారి.. చిరంజీవికి బాలకృష్ణ క్షమాపణ చెప్పాలన్న స్థితికి చేరుకుంది. అయితే దీనిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార అస్త్రంగా మార్చుకుంది. అప్పట్లో సినీ పరిశ్రమకు వ్యతిరేకంగా జగన్మోహన్ రెడ్డిని చెప్పుకొచ్చారని.. ఆ ప్రచారంలో ఎంత మాత్రం నిజం లేదని.. ఇదంతా

టీడీపీ కూటమి పని అని తేల్చి చెప్పే ప్రయత్నం చేసింది. చిరంజీవిని టార్గెట్ చేసుకున్న బాలకృష్ణ క్షమాపణ చెప్పాల్సిందేనని చెప్పింది. చిరంజీవి పట్ల జగన్మోహన్ రెడ్డి తన అభిమానాన్ని చాటుకుంటూ వచ్చారని గుర్తుచేసింది. తద్వారా కూటమిలో విచ్ఛిన్నం తేవాలని చూసింది. సామాజిక రంగు కూడా దీనికి పులుముకుంది. దీంతో సీఎం చంద్రబాబు సైతం అసహనం వ్యక్తం చేసినట్లు ప్రచారం నడిచింది. అయితే ఇంతటి వివాదానికి కారణమైన కామినేని శ్రీనివాస్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నట్లు.. అపార్థాలకు కారణమైన ఈ ఘటనకు సంబంధించిన వీడియోలను రికార్డుల నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేయడం విశేషం. దీంతో ఈ వివాదానికి కొంతవరకు ఎండ్ కార్డు పడినట్టే.

## కూటమికి దూరమౌతున్న కాపు వర్గం

కాకినాడ, సెప్టెంబర్ 29,ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. ఏదో ఒక రూపంలో విపక్షానికి కాల కలసి వస్తుందని భావించి ఉంటారు కానీ.. అందులో టీడీపీ నేత, చంద్రబాబు నాయుడు బామ్మర్ది బాలకృష్ణ రూపంలో తమ పార్టీకి హైప్ వస్తుందని వైసీపీ నేతలు ఊహించి ఉండరు. వైసీపీకి ఎటూ దారి తోచని స్థితిలో నందమూరి బాలకృష్ణ ఫ్యాన్ పార్టీకి ఒక మార్గం చూపినట్లయింది. ఇటీవల నందమూరి బాలకృష్ణ అసెంబ్లీ సమావేశాల్లో చేసిన వ్యాఖ్యలు కూటమి పార్టీలో కలతలు ఎత వరకూ పెడతాయో తెలియదు కానీ, వైసీపీకి మాత్రం కొండంత బలం చేకూర్చాయని చెప్పాలి. జగన్ సైకోగాడంటూ బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు కొంత బాధ కలిగించవచ్చు కానీ, అదే సమయంలో బాలయ్య చిరంజీవి పై చేసిన కామెంట్లు తమకు కలసి వచ్చేటట్లుగా ఉన్నాయని తెగ ఖుషీ ఫీలవుతున్నారు. గతంలో జగన్ పై చేసిన ఆరోపణలన్నీ ఒక్కసారిగా బాలయ్య తెలిసీ తెలియకుండా చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రయోజనం కల్పించాయి. ఎందుకంటే గత ఎన్నికల సమయంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జగన్ వద్దకు వెళ్లినప్పుడు తన సోదరుడు, మెగాస్టార్ చిరంజీవిని అవమానించారని పదే పదే ఆరోపించారు.జగన్ యాటిట్యూడ్ అదేనని, సాక్షాత్తూ చిరంజీవినే అవమానిస్తే ఇక సామాన్యుల మాటేమిటని ప్రశ్నించారు. కానీ అప్పుడు పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను ఖండించని చిరంజీవి నేడు బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలతో కొంత ఘాటుగానే స్పందించారు. జగన్ తనను సాదరంగా ఆహ్వానించారన్నారు. తనను అవమానించలేదని చిరంజీవి చెప్పడంతో వైసీపీకి పవన్ కళ్యాణ్ గతంలో చేసిన ఆరోపణలు అబద్ధమని తేలిపోయింది. మరొకవైపు బాలయ్య చేసిన వ్యాఖ్యలతో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జనసేన నేతలపై కూడా అక్కడ కాపు సామాజికవర్గం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాలకృష్ణ అన్ని మాటలు చిరంజీవిని అన్నప్పటికీ జనసేన మంత్రులు అసెంబ్లీలో ఉండి ఎందుకు ఖండించలేదని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. అదే సమయంలో రాయలసీమలోని బలిజ సామాజికవర్గం నుంచి కూడా వ్యతిరేకత వ్యక్తమవుతుంది. పవన్ కళ్యాణ్, నాగబాబు లు కూడా ఈ విషయంపై స్పందించకపోవడంతో పాటు టీడీపీ ముఖ్యనేతలు కూడా కనీసం ఆ వ్యాఖ్యాలపై చిరంజీవికి అనుకూలంగా కామెంట్స్ చేయకపోవడంపై కాపు సామాజికవర్గం నేతలతో పాటు చిరంజీవి అభిమానులు ఆగ్రహంగా ఉన్నారు. సోషల్ మీడియాలో ఇది కనిపిస్తుంది. అందుకే వైసీపీతమఅధినేతను సైకోఅనిఅన్నప్పటికీ బాలయ్య చేసిన వ్యాఖ్యలతో వాతావరణం తమకు అనుకూలంగా మారిందన్న లెక్కలు వేసుకుంటున్నారు.

# లంచాలు తీసుకొని అభివృద్ధి చేస్తున్నా..

## వైరల్ గా మారిన కామెంట్స్

ఏలూరు, సెప్టెంబర్ 29, ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ముఖ్యంగా కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేల తీరు ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. గత కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలు కూటమిలో క్రమశిక్షణను ప్రశ్నిస్తున్నాయి. శాసనసభలో బిజెపి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు టిడిపి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ. జగన్ హయాంలో సినీ ప్రముఖులు కలిసినప్పుడు జరిగిన పరిణామాలపై స్పందించారు. ఎగతాళిగా మాట్లాడారు. చిరంజీవి ప్రస్తావన తీసుకురావడంతో మెగా అభిమానులు ఆగ్రహంగా ఉన్నారు. అయితే ఈ వివాదం పై సీఎం చంద్రబాబు కూడా స్పందించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల తీరుపై అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. సరిగ్గా ఇటువంటి సమయంలో జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రభుత్వ అవినీతితో పాటు ఎమ్మెల్యేల లంచాల పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ప్రముఖ జర్నలిస్టు జాఫర్ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తో ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అవినీతితో పాటు ఎమ్మెల్యేల ఆదాయంపై ప్రశ్నించారు. అయితే దీనిపై మనసులో ఉన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు బొలిశెట్టి. తనతో పాటు నూటికి 99 మంది ఎమ్మెల్యేలు ఇలానే చేస్తున్నారు అంటూ ఆయన చెప్పుకు రావడం విశేషం. వాత పెట్టేది మేమే.. వెన్న పూసేది మేమే.. అలాగే ప్రతి అంశంలోనూ డబ్బుల లావాదేవీలు నడుస్తాయని చెప్పుకొచ్చారు. నాలుగు నుంచి ఐదు కోట్ల రూపాయల వరకు లంచాలు వస్తాయని బహిరంగంగానే ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఎమ్మెల్యేలకు ఎక్కువగా ఆదాయం సమకూరుతోందని? తనకు కూడా అదే మాదిరిగా వచ్చిందని బొలిశెట్టి నిర్మొహమాటంగా చెప్పడం విశేషం.అయితే ఇటీవల జరుగుతున్న పరిణామాలు కూటమిని ఇరకాటంలో పెడుతున్నాయి. ప్రస్తుతం మూడు పార్టీల ఉమ్మడి ప్రభుత్వం నడుస్తోంది. ఎమ్మెల్యేలు క్రమశిక్షణతో మెలగాలని మూడు పార్టీల నాయకత్వాలు సూచించాయి. కానీ ఎమ్మెల్యేలు స్వేచ్ఛకు మించి మాట్లాడుతున్నారు. తమ పార్టీలతో పాటు కూటమికి ఇబ్బందులు తెచ్చి పెడుతున్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే బొలిశెట్టి అలా స్పందించేసరికి.. సోషల్ మీడియాలో ఈ అంశం వైరల్ గా మారింది. తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్నారు బొలిశెట్టి శ్రీనివాస్. అప్పట్లో అల్లు అర్జున్ సినిమా విషయంలో సైతం అతిగా స్పందించారన్న విమర్శ ఉంది. అప్పట్లో హై కమాండ్ గట్టిగానే హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది. ఇప్పుడు లంచాలు సహజం అన్నట్టు.. ఏకంగా ఓ మీడియా ఇంటర్వ్యూలోనే బొలిశెట్టి వ్యాఖ్యానించడం వివాదాస్పదంగా మారుతోంది. మరి దీనిపై జనసేన నాయకత్వం, కూటమి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.నేను పదవిని అడ్డంపెట్టుకుని లంచాలు తీసుకుంటున్నా..దోచుకున్న సొమ్ముతో అభివృద్ధి చేద్దాం అని సిగ్గులేకుండా చెప్తున్నా నేను..

# టమాటా రైతుల కన్నీరు



కర్నూలు సెప్టెంబర్ 29, దసరాసమీపిస్తోంది. కూరగాయలతో పాటు నిత్యవసరాల అమ్మకాలు పెరిగాయి. వాటి ధరలు చూస్తుంటే మాత్రం మండిపోతున్నాయి. ముఖ్యంగా టమాటా ధర పాతిక రూపాయల కు పైగానే ఉంది. కానీ ఏపీలో ఆ ప్రాంతాల్లో మాత్రం కిలో 50 పైసలకే దొరుకుతుంది. రూపాయి ఇస్తామంటే రైతులు ఎగబడి ముందుకు వచ్చి అమ్ముతున్నారు. అయితే ధరల స్థిరీకరణ లేకపోవడం, యంత్రాంగం ముందు చూపు లేకపోవడం వంటి కారణాలతో పంట లభ్యమయ్యే చోట తక్కువ ధర పలుకుతోంది. ఇతర ప్రాంతాల్లో మాత్రం అందనంత దూరంలో ఉంది. దీంతో టమాటా రైతు పడుతున్న బాధ అంతా ఇంతా కాదు.ఏపీలో టమాటా పంటకు పెట్టింది పేరు కర్నూలు జిల్లా. జిల్లా వ్యాప్తంగా విరివిగా పండుతుంది టమాట. ప్రస్తుతం పంట అందుబాటులోకి వచ్చింది. దిగుబడి బాగా ఉంది. కానీ ధర మాత్రం పూర్తిగా పడిపోయింది. కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపలేదు. అయితే ధర విషయంలో చేదు అనుభవం ఎదురు కావడంతో రైతులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. మార్కెట్లో పోసి నిరసన వ్యక్తం చేస్తున్నారు. టమాటా విక్రయాలు జరపకుండానే ఆరుగాళం కష్టపడే రైతుకు శ్రమకు తగ్గ ఫలితం రావడం లేదు. పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు. ఈ క్రమంలో పంటలు పండించి అప్పుల పాలవుతున్నారు. రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో కిలో టమాట పాతిక రూపాయల పై మాటే. కానీ కర్నూలు జిల్లాలో(రైతులు వద్ద టమాటా రూపాయికి కూడా అడగడం లేదు. ఇలా ధరల స్థిరీకరణ లేకపోవడంతో నష్టపోవడం రైతుల వంతు అవుతోంది. కనీసం గ్రామం నుంచి మార్కెట్ కు తీసుకొచ్చేందుకు రవాణా ఖర్చులు కూడా రావడం లేదు. అటువంటప్పుడు పంట సేకరణ ఎందుకు చేయాలని కొందరు.. తెచ్చిన పంటను రహదారుల పక్కనే పారేస్తున్నారు మరి కొందరు. మార్కెట్కు తీసుకువచ్చినవారు వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతుండడంతో.. తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. మార్కెట్లో టమాటా పారబోసి నిరసన తెలుపుతున్నారు.

# ఇంద్రకీలాద్రిపై పెరిగిన భక్తుల రద్దీ

విజయవాడ సెప్టెంబర్ 29,సోమవారం నాడు ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ పెరిగింది. వీఎంసీ హోల్డింగ్ ఏరియాల్లోల్లోని కంపార్టుమెంట్లలో భక్తులతో నిండిపోయింది. ఇంద్రకీలాద్రి పరిసరాల్లో వాహన రాకపోకలపై ఆంక్షలు విధించారు. ఉదయం 7.15 వరకు అమ్మవారిని 55,513 మంది భక్తులు దర్శించుకున్నారు. మూలా నక్షత్రం రోజు రెండు లక్షలమంది భక్తులు వస్తారని అంచనా వేసారు. కొండపైకి వీవీఐపీ వాహనాలు మినహా ఇతర వాహనాలు నిషేధించారు. కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు భక్తుల రద్దీని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అదనపు బలగాల సాయంతో భక్తుల రద్దీని క్రమబద్దీకరిస్తున్నారు,.

# అక్రమంగా ఆవుల రవాణా

## పట్టుకున్న హిందూ సంఘాలు

ఏలూరు,అక్రమంగా ఆవులను తరలిస్తున్న కంటైనర్ వాహనాన్ని హిందూ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఏలూరు జాతీయ రహదారిలో పట్టుకున్నారు. ఏలూరు ఆశ్రమం రోడ్డులోని పాలగుడం వంతెన వద్ద ఈ కంటైనర్ను ఆపి హిందూ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు తనిఖీచేయుగా వారు ఆవులను గుర్తించమని తెలిపారు కంటైనర్లు పోలీస్ స్టేషన్కు అప్పగిస్తున్నామని కూడా వారు స్పష్టం చేశారు

# త్వరలో టీడీపీ కమిటీలు

గుంటూరు, సెప్టెంబర్ 29, టీడీపీ రాష్ట్ర కమిటీ ఎలా ఉండబోతోంది.. ఎవరెవరికి ఈ సారి అవకాశాలు ఉంటాయి.. టీడీపీ జాతీయ అధ్యక్షుడు సీఎం చంద్రబాబు త్వరలో టీడీపీ స్టేట్ కమిటీ ఏర్పాటు జరుగుతుందని స్పష్టత ఇవ్వడంతో పార్టీ వర్గాల్లో చర్చ మొదలయింది.. ఆ దిశగా ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సమావేశాలు ముగిసాయి. అసలు తెలుగుదేశం పార్టీలో సంస్థాగత మార్పులు ఎలా ఉండబోతున్నాయి? టీడీపీలో సంస్థాగత మార్పులపై చర్చ. తెలుగుదేశం పార్టీలో సంస్థాగత మార్పులు..క్రియాశీల పదవులు, మిగిలిన నామినేటెడ్ పదవుల భర్తీకి సంబంధించి చర్చ జరుగుతోంది. ఈ నెలాఖరులోగా మరికొన్ని నామినేటెడ్ పదవులు భర్తీ అయ్యే అవకాశం ఉంది.. దీంతో పాటు త్వరలో జిల్లా కమిటీలను పూర్తి చేసి ఆ తర్వాత రాష్ట్ర టీడీపీ కార్యవర్గం ఏర్పాటుపై దృష్టి పెట్టనుంది టీడీపీ అధిష్టానం.. ఆ క్రమంలో రాష్ట్ర టీడీపీ కమిటీకి సంబంధించి పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జిల్లా కమిటీలు పూర్తి చేసి వెంటనే స్టేట్ కమిటీలపై దృష్టి పెట్టనున్నారు. యువత, మహిళలకు ఎక్కువగా అవకాశాలు వచ్చే పరిస్థితి కనిపిస్తోంది.. యువతను బాగా ఎంకరేజ్ చెయ్యాలనే అలోచనలో పార్టీ అధిష్టానం ఉందంట. అందులో భాగంగానే కొన్ని కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తోందంట.. ఎన్నికల సమయంలో పార్టీకి సేవలు అందించిన వారికి , టికెట్లు రానివారు.. అదే విధంగా మహిళలకు ఈసారి కమిటీల్లో ప్రాధాన్యత దక్కనుంది. కార్యకర్తలుగా కెరీర్ ప్రారంభించి పార్టీని అంటి పెట్టుకుని ఉన్న నేతలకు అవకాశాలు రానున్నాయి. సీఎం చంద్రబాబు కూడా ఇదే అంశాన్ని నేతలకు చెబుతున్నారు. పార్టీతో పాటు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారి గురించి ఆరా. పార్టీ పదవులు తీసుకోడానికి ఎవరెవరు సుముఖత వ్యక్తం చేస్తున్నారు? ఎవరు నామినేటెడ్ పదవులు అడుగుతున్నారనే అంశంపై కూడా హైకమాండ్ స్పష్టత

# గీత దాటేస్తున్న తెలుగు తమ్ముళ్లు

విజయవాడ, సెప్టెంబర్ 29, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు నాలుగో సారి బాధ్యతలను చేపట్టారు. అయితే గత మూడు దఫాలుగా ఇలాంటి పరిస్థితిని ఆయన ఎదుర్కొనలేదు. ఒకరకంగా చెప్పాలంటే చంద్రబాబు చేయి దాటి పోయే పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యేలు గాడి తప్పుతున్నారు. కూటమిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ తాను వస్తుంటే వాటిని చెడగొట్టేందుకు ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నారు. పార్టీ లైన్ తో పాటు నాయకత్వంపై కొంచెం కూడా భయం లేకుండా వ్యవహరిస్తున్నారు. 1999 లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా దగ్గర నుంచి చూసిన వారికి ఇది అర్థమవుతుంది. నాడు మంత్రులు మీడియా సమావేశం పెట్టి మాట్లాడాలన్నా నాటి సీపీఆర్వో విజయ్ కుమార్ ను అడిగి పర్మిషన్ తీసుకోవాలి. అంటే చంద్రబాబు అనుమతితోనే మీడియా సమావేశాలు, అందులో మాట్లాడాల్సిన అంశాలను ప్రస్తావించేవారు. కానీ ఇప్పుడు స్వేచ్ఛ ఎక్కువగా టీడీపీలో కనిపిస్తుంది... కానీ ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితి లేదు. ఎవరికి వారే యమునా తీరే. ఒకరు ఇద్దరు కాదు.. అనేక మంది ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనివల్ల కూటమిలోని మిత్రపక్షాల మధ్య వైరం నెలకొనేలా సొంత పార్టీ ఎమ్మెల్యేలే చేస్తున్నారు. కావాలనే చేస్తున్నారా? లేక అవగాహన లోపంతో చేస్తున్నారా? అంటే వాళ్లేమీ కొత్త వారు కాదు. సీనియర్ నేతలు. అన్నీ విషయాలు తెలుసు. వారిలో పార్టీ నాయకత్వంపై ఉన్న అసంతృప్తిని ఇలా తీర్చుకుంటున్నారని అర్థం చేసుకోవాల్సి వస్తుంది. ప్రతిపక్షం లేకపోయినంత మాత్రాన అంత స్వేచ్ఛగా వ్యవహరించాలా? అని చంద్రబాబు మండిపడుతున్నట్లు తెలిసింది. సీనియర్ నేతలే ఇలా వ్యవహరిస్తున్నారంటే పార్టీ క్రమశిక్షణ పట్టుతప్పుతున్నట్లే కనిపిస్తుందని చంద్రబాబు భావిస్తున్నారు. దీంతో త్వరలోనే దీనిపై చంద్రబాబు సీరియస్ గానే నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలిసింది. పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వైఖరి ని కూడా చంద్రబాబు తప్పుపట్టారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారిని తన్నాలన్నట్లుగా వ్యాఖ్యలు చేయడం ఏమిటని చంద్రబాబు సీరియస్ అయ్యారని తెలిసింది. అలాగే ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోషల్ మీడియా పోస్టుల విషయంలో హోంశాఖ తీరు సరిగా లేదంటూ తప్పు పట్టారు. ఈ విషయాన్ని ప్రస్తావించిన సీఎం... సీనియర్లు కూడా ఇలా మంత్రులను లక్ష్యంగా చేసుకుని మాట్లాడితే ఎలా అని ప్రశ్నించినట్లు తెలిసింది. కైకలూరు, హిందూపురం ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, నందమూరి బాలకృష్ణ సంవాదంపై కూడా చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అయితే ఇటీవల కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు అత్యుత్సాహంతో చేసిన ప్రసంగాలు ప్రభుత్వానికి తలనొప్పులు తెచ్చిపెట్టాయి. కొన్నిచోట్ల శాంతి భద్రతల సమస్యలున్నాయని, మరికొన్ని చోట్ల ఉద్యోగుల ట్రాన్స్ ఫర్ల విషయంలో ఎమ్మెల్యేలు వ్యక్తిగత విషయాలను ప్రస్తావించారు. వారంతా పరోక్షంగా ప్రభుత్వాన్నే విమర్శించారు. ఈ విషయంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. కూన రవికుమార్, బొజ్జల సుధీర్ రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. మరోసారి ఇలాంటివి రిపీట్ చేయొద్దని గట్టిగానే చెప్పారట. ముందు జాగ్రత్తలు.. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరే అయింది. మరో మూడున్నరేళ్లపాటు ఎవరు ఏమన్నా కూటమిదే అధికారం. ఒకవేళ కూటమిలో లుకలుకలు వచ్చినా క్లియర్ కట్ మెజార్టీ టీడీపీదే కాబట్టి సీఎంగా చంద్రబాబు స్థానానికి వచ్చిన ముప్పేమీ లేదు. అలాగని ఆయన రిలాక్స్ కావడం లేదు. 2029 నాటికి ఈ పరిస్థితుల్లో ఎలాంటి తేడాలు రాకూడదని ఆయన కోరుకుంటున్నారు. అందుకే ఇప్పట్నుంచి ఎమ్మెల్యేలను కంట్రోల్ లో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. క్రమశిక్షణ గీత దాటితే సహించేది లేదంటున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకరిద్దరు ఎమ్మెల్యేలపై విమర్శలు రావడంతో వారిని పక్కనపెట్టారు చంద్రబాబు. ఇప్పుడు మరికొంతమందిని సెట్ రైట్ చేస్తున్నారు. జగన్ చేసిన తప్పు అదే గతంలో జగన్ హయాంలో కూడా ఎమ్మెల్యేలు కొంతమంది హద్దుమీరు ప్రవర్తించినా ఆయన పట్టించుకోలేదు. సరికదా వారిని మరింత ప్రోత్సహించారు కూడా.

# మహా సరస్వతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ గాయత్రీ మాత..



విభారే న్యూస్ సెప్టెంబరు 29 ఎమ్మిగనూరు..స్థానిక గీత సర్కిల్లో ఉన్న గీత నగర్ లో వెలసిన శ్రీ గాయత్రి మాత ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు అయిన సోమవారం రోజు శ్రీ గాయత్రి మాత భక్తులకు మహా సరస్వతి అలంకారంలో దర్శనమిచ్చారు. ప్రాతః కాలంలోనే అమ్మవారికి వివిధ రకాల పూజలు నిర్వహించారు అనంతరం పూల అలంకరణ చేసి శ్రీ సరస్వతీ దేవిగా అలంకరణ చేసి ప్రసాదాన్ని నివేదన చేసి మహా మంగళహారతిని ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు అయ్యారు. అమ్మవారికి పూజా కార్యక్రమాలు అన్నియు ఆలయ ప్రధాన అర్చకులు బలకుంది నరహరి శాస్త్రిచే నిర్వహించబడును.

# స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ? 2025 (ఇంటర్నల్ లెవెల్) పోటీల నిర్వహణ..




విభారే న్యూస్ సెప్టెంబరు 29 ఎమ్మిగనూరు..ఎమ్మిగనూరు లోని సెయింట్ జాన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, టెక్నాలజీ లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ? 2025 (ఇంటర్నల్ లెవెల్) పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ హ్యాకథాన్ సెప్టెంబర్ 22 నుండి ఈ రోజు 29 వరకు ఉత్సాహంగా కొనసాగింది.ఈ పోటీల్లో మొత్తం 300 మంది బీటెక్ విద్యార్థులు 50 బృందాలుగా పాల్గొని తమ సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించారు. విద్యార్థులు ప్రతిపాదించిన ప్రాజెక్టులు నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిష్కారాలు, సామాజిక సమస్యల పరిష్కారం వంటి విభిన్న అంశాలను ప్రతిబింబించాయి. ఈ ప్రాజెక్టులను సాంకేతికపరమైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో సమర్పించారు. వారి ప్రతిభ ఆధారంగా 29 బృందాలను తదుపరి రౌండ్‌కు ఎంపిక చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల నుండి నలుగురు సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎస్. అనీల్ అమృత రాజు, డాక్టర్ కె. చిత్తంబరయ్య శెట్టి, డాక్టర్ జి. మారుతి ప్రసాద్ యాదవ్, డాక్టర్ పి. వీరేష్ లు జ్యూరీ సభ్యులుగా వ్యవహరించగా, డాక్టర్ వై. నరసింహ రెడ్డి కొ-ఆర్డినటర్ గా బాధ్యతలు నిర్వర్తించారు. జ్యూరీ సభ్యులు విద్యార్థుల ప్రదర్శనలు, సాంకేతికత వినియోగం, సమస్య పరిష్కార నైపుణ్యం వంటి ప్రమాణాల ఆధారంగా బృందాలను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధాకర్ విద్యార్థుల ఉత్సాహాన్ని అభినందిస్తూ, ఇలాంటి పోటీలు విద్యార్థులలో నవీన ఆలోచన, సమస్య పరిష్కార దృక్పథం, బృందస్ఫూర్తి పెంపొందించడంలో మైలురాయిగా నిలుస్తాయని తెలిపారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ సుంకులమ్మ..

విభారే న్యూస్ సెప్టెంబరు 29 ఎమ్మిగనూరు..పట్టణంలోని మెయిన్ బజార్లో వెలసిన శ్రీ సుంకులమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజైన సోమవారం రోజు శ్రీ సుంకులమ్మ భక్తులకు సరస్వతి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రాతఃకాలంలోనే అర్చన అభిషేకం పూల అలంకరణ చేసి నిమ్మకాయల మాల వేసి శ్రీ సరస్వతీ దేవిగా అమ్మవారిని అలంకరణ చేశారు. అనంతరం ప్రసాదాన్ని, పుస్తకాలు పెన్నులు నివేదన చేసి అనంతరం మహా మంగళహారతి చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. మహా మంగళహారతి అనంతరం మాజీ ఎంపీ వైఎస్ఆర్సిపి ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్చార్జి శ్రీమతి బుట్టా రేణుక దంపతులు సుంకులమ్మని దర్శించుకున్నారు. ఆలయ పూజారి తీర్థ ప్రసాదాలను వారికి అందజేశారు. ఆయన భార్య శ్రీమతి భారతి అమ్మవారి చీర తాంబూలం బుట్టా రేణుకకు అందజేశారు. అమ్మవారికి అలంకరణ ఆలయ పూజారులు నాగరాజు కుటుంబ సభ్యులు మరియు కే ఉషారాణి చే నిర్వహించబడును.




# అక్టోబర్ 7న విజయవాడలో ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయుండి.. – ఫ్యాప్టో

కర్నూలు జిల్లా.. విభారే న్యూస్ సెప్టెంబరు 29 కర్నూలు జిల్లా ప్రతినిధి..రాష్ట్రంలోని ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా అక్టోబర్ 7వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ నందు వేలాది మంది ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు కాకి ప్రకాష్ రావు కర్నూలు జిల్లాలోని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు విజయవాడలో చేపట్టబోయే ధర్నాను విజయవంతం చేయుటకు సన్నాహక సమావేశం కర్నూలు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఆర్ సేవా లాల్ నాయక్ అధ్యక్షతన ఎస్టియు భవన్ నందు జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్, కర్నూలు జిల్లా పరిశీలకులుకాకి ప్రకాష్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుండి తప్పించడం, అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పిఆర్సి, మధ్యంతర భృతి మంజూరు, సి.పి.ఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని తెలిపారు. ఉద్యోగులకు స్నేహ పూరిత ప్రభుత్వం అని చెబుతూనే రాష్ట్రంలోని 12 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించిన పరిస్థితి కానీ, చర్చించిన పరిస్థితి కానీ లేదన్నారు. ప్రభుత్వ పథకాలను, నిర్ణయాలను విజయవంతంగా అమలు చేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన సమస్యల పరిష్కారం, సంక్షేమం మాత్రం ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించవలసిన దాదాపు 30 వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరినప్పటికీ ఇంతవరకు స్పందన లేదన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఇంతవరకు చర్చించిన పరిస్థితి లేదన్నారు. 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుకు సంబంధించిన దస్త్రం ఆర్థిక శాఖలో గత నాలుగు సంవత్సరాలుగా మూలుగుతుందన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించవలసిన గ్రాట్యుటీ, కమ్యూటేషన్, ఈ.ఎల్ ఎన్క్యాష్మెంట్, అంత్యక్రియల ఖర్చులు తదితర పెన్షన్ సౌలభ్యాలను కూడా చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతుందన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్న డిమాండ్ చేయవలసిన పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకొని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు ప్రతి సంవత్సరము 180 కోట్ల రూపాయలు హెల్త్ కార్డుల అమలు కొరకు చెల్లిస్తున్నప్పటికీ హెల్త్ కార్డు పై వైద్యానికి ఏ హాస్పిటల్లో అంగీకరించడం లేదన్నారు. ప్లస్ టు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. వెంటనే ప్లస్ టూ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పురపాలక ఉపాధ్యాయులకు జిపిఎఫ్ సౌకర్యము, అర్బన్ ఎంఈఓ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. గురుకుల, ఆదర్శ,1998,2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు.కేజీబీవీ ఉపాధ్యాయులతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ కనీస వేతన స్కేల్ కూడా అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వెంటనే ఎంటీఎస్ ను అమలు చేయాలని కోరారు.ఫ్యాప్టో జిల్లా చైర్మన్ సేవా లాల్ నాయక్ మాట్లాడుతూ కారుణ్య నియామకాలలో జాప్యం వలన మరణించిన ఉద్యోగుల వారసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంతర్ జిల్లా బదిలీలలో స్పౌజ్ క్యాటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న వారందరికీ బదిలీ అవకాశం కల్పించాలని కోరారు. ఏకీకృత సర్వీస్ రూల్స్, జేఎల్ పదోన్నతుల సమస్యపై ప్రభుత్వం చిత్తశుద్ధి కనపరచకపోవడంతో మూడు దశాబ్దాలుగా కోర్టుల




చుట్టూ తిరగవలసి వస్తోందన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ సంఘాలతో విద్యా రంగ, ఆర్థిక సమస్యలపై చర్చించి పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో సెక్రటరీ జనరల్ భాస్కర్ మాట్లాడుతూ గతం లో కర్నూలు జిల్లా ఫ్యాప్టో ఇచ్చిన లేఖ పై స్పందించిన కడప ఆర్ జె డి శామ్యూల్ కి ధన్యవాదములు తెలిపారు. అలాగే కర్నూలు జిల్లా విద్యాధికారి జిల్లా లోని విద్యా శాఖ సమస్య ల పై ఫ్యాప్టో సభ్య సంఘాల తో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని అదే విషయం ను నేడు లేఖ ద్వారా జిల్లా విద్యాధికారి కి లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేయడం జరిగింది అని చెప్పారు.కార్యవర్గ సభ్యులు రవి కుమార్ (యు టి ఎఫ్), నవీన్ పాటిల్ (యు టి ఎఫ్), గోకారి (ఎస్ టి యు), జనార్ధన్ (ఎస్ టి యు), రంగన్న (ఎ పి టి ఎఫ్ 257), ఇస్మాయిల్ (ఎ పి టి ఎఫ్ 1938),మరియానందం(ఎ పి టి ఎఫ్ 1938), మధుసూదన్ రెడ్డి (ఆప్టా) హుస్సేన్(ప్రధానోపాధ్యాయ సంఘం), రోషన్న (డి టి ఎఫ్), నందీశ్వరుడు (బి టి ఎ) శేఖర్ (పి ఈ టి అసోసియేషన్), వెంకటేశ్ (ఎస్ టి టి ఎఫ్)తదితరులు అక్టోబరు 7 వ తేదీన విజయవాడ లో జరిగే ఫ్యాప్టో ధర్నా కార్యక్రమం నకు కర్నూలు జిల్లా నుండి పెద్ద ఎత్తున కదలి వెళ్ళాలి అని సంయుక్తంగా కర్నూలు జిల్లా ఉపాధ్యాయులకు పిలుపు ను ఇచ్చారు.

# సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ శ్రీ శ్రీ జంబులమ్మ దేవి..



విభారే న్యూస్ సెప్టెంబర్ 29 ఎమ్మిగనూరు..స్థానిక సొగనూరు రోడ్డులో వెలసిన శ్రీశ్రీ శ్రీ జంబులమ్మ దేవి ఆలయంలో ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ శుద్ధ దశమి వరకు అమ్మవారికి వివిధ అలంకరణలు, విశేష పూజలు, అర్చనలు అభిషేకాలు పారాయణాలు జరుగుతూ ఉన్నవి. అందులో భాగంగానే 8వ రోజు అయిన సోమవారం రోజు మూలా నక్షత్రం పురస్కరించుకొని జంబులమ్మకు సరస్వతి దేవి అలంకరణను గావించబడినది. ప్రతిరోజు ఉదయము పూజలు సాయంత్రం అలంకరణలు మహా మంగళహారతి అనంతరం ప్రసాద వితరణ జరుగును. సోమవారం సాయంత్రం ఏడు గంటలకు భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. ఆలయంలోని అమ్మవారికి ఆలయ ధర్మకర్త తట్టేబుడ్డప్ప వారి కుటుంబ సభ్యులు అలంకరణను గావించారు. మూలా నక్షత్రం సందర్భంగా మాజీ ఎంపీ శ్రీమతి బుట్టా రేణుక దంపతులు జంబులమ్మని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం బుట్టా రేణుక దంపతులను తట్టే బుడ్డప్ప కుటుంబ సభ్యులు దృశ్యాలువతో సన్మానించి తీర్థప్రసాదములను అందజేశారు.

# అఖిల భారత అయ్యప్ప చిన్న చిన్ముద్ర సేవా ట్రస్టు కార్యవర్గ సభ్యుడుగా గురు బుజ్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రంగస్వామి రెడ్డి లకు చోటు..

విభారే న్యూస్ సెప్టెంబరు 29 కర్నూలు జిల్లా ప్రతినిధి..కర్నూలు అఖిలభారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్టు ఇటీవలనే అయ్యప్ప స్వాములచే మొదటి జాతీయ వర్గ సమావేశం. అనంతపూర్ జిల్లా గార్లదిన్నెలో నిర్వహించడం జరిగినది. మొదటి సమావేశమునకు ఎమ్మిగనూరు నుండి రవిచంద్ర గురుస్వామి గంగాధర్ గురుస్వామి రంగారెడ్డి గురు స్వాములు, నందవరము పత్తికొండ గురు స్వాములు కూడా ఆ సమావేశమునకు హాజరయ్యారు. ఆ సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు గా గురు బుజ్జి గురు స్వామిని రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రంగస్వామి లకు చోటు కల్పించారు. వారికి స్థానం కల్పించినందుకు డాక్టర్ ఆది మోహన్ రెడ్డి, రు ద్ర కోటేశ్వర రావు పిట్టా శ్రీ హరి, డాక్టర్ బి ఈశ్వర్ వారికి హృదయపూర్వక అభినందనలు గురు బుజ్జి, రంగస్వామి రెడ్డి గురుస్వామిలు తెలిపారు.



# ఎమ్మిగనూరు మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సెల్ గా ఎమ్. కె. గురు రాజారావు ఎన్నిక..



విభారే న్యూస్ సెప్టెంబరు 29 ఎమ్మిగనూరు..ఎమ్మిగనూరు మున్సిపాలిటీ న్యాయ సలహాదారుగా సీనియర్ న్యాయవాది ఎమ్. కె. గురు రాజారావును నియమిస్తూ మున్సిపల్ చైర్మన్ రఘునాథ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరి పదవీకాలం మూడేళ్ళ. గతంలోనూ న్యాయ సలహాదారుగా పనిచేసిన ఎమ్. కె. గురు రాజారావు, లోక్ అదాలత్ లో మున్సిపాలిటి తరఫున వేల రూపాయలు మున్సిపాలిటీకి జమ కావడానికి కృషి చేశారు. ఎంపిక ప్రక్రియ 06.08.2025వ తేదీ 1163/2019/1 ద్వారా దరఖాస్తులను ఆహ్వానించగా ముగ్గురు న్యాయవాదులు: ఎం.కె. గురురాజారావు, ఎస్.జి. గురు ప్రసాద్, ఎం.జి. నర్సారెడ్డి లు దరఖాస్తులు చేసుకోగా, మున్సిపల్ కౌన్సిలర్లు తమ,తమసిఫార్సులను చైర్మన్‌కు సమర్పించారు, దీని ఫలితంగా ఎం.కె. గురురాజారావుకు అనుకూలంగా తీర్మానం చేయబడింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "31.08.2028 వరకు వరుసగా 3వసారి ఎమ్మిగనూరు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సెల్‌గా ఎన్నికవడం నాకు గౌరవంగా ఉంది" అని తన కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ, నాపై నమ్మకం ఉంచినందుకు నాయకులకు, మున్సిపల్ కౌన్సిలర్లకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీ మద్దతు మరియు ప్రోత్సాహమే ఈ గౌరవానికి చోదక శక్తి. ఈ కార్యాలయం యొక్క విలువలను నిలబెట్టడానికి అంకితభావం, సమగ్రత మరియు నిబద్ధతతో నా విధులను నిర్వర్తించడం కొనసాగిస్తానని నేను మీకు హామీ ఇస్తున్నాను." అని అన్నారు.

# తిరుమలలో శరన్నవరాత్రి సందర్భంగా సాలుకట్ల బ్రహ్మోత్సవాలు

విభారే న్యూస్ సెప్టెంబరు 29 ఎమ్మిగనూరు..అంగరంగ వైభవంతో తిరుపతిలో గోవింద నామస్మరణతో జరుగుతున్న సాలుకట్ల బ్రహ్మోత్సవాలు లో భాగంగా ఆదివారం సాయంత్రము శ్రీవారి గరుడసేవ కన్నుల పండుగగా జరిగినది. ఆ వైభవమును చూచుటకు పౌరోహితులు రఘునందన స్వామి తిరుపతికి వెళ్లి స్వామివారి దర్శనములు కనులారా గావించి స్వామి కృపకు పాత్రులైనారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**